ప్రజాశక్తి



ఎన్నికల బాండ్లను బహిర్గతం చేయాలి

- కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అవినీతి రాజకీయాలను పెంచి పోషించి, ప్రభుత్వాన్ని కార్పొరేట్ ఏజెంట్‌గా మార్చిన ఎన్నికల బాండ్లను వెంటనే ఎస్‌బిఐ బహిర్గత పరచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని చిన్న పార్క్ వెనక ఉన్న ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ముందు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమైనా ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం ఎస్‌బిఐ నుండి గ్లోబ్ సర్కిల్ చుట్టుకుని తిరిగి ఎస్‌బిఐ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.రాముడు అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. వారు మాట్లాడుతూ రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసిన నరేంద్ర మోడీ విధానాలను సుప్రీంకోర్టు తప్పు పట్టిందని, ఎన్నికల బాండ్లను జూన్ 6 లోపు ఎస్‌బిఐ విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి లొంగిపోయిన ఎస్‌బిఐ యాజమాన్యం ఎన్నికల బాండ్ల విడుదల కోసం 116 రోజులు గడువు కావాలని అడగడం సిగ్గుచేటన్నారు. ఇది కేవలం బిజెపి రాజకీయ అవినీతిని కప్పిపుచ్చడం కోసం నరేంద్ర మోడీకి మోకరిల్లడం తప్ప వేరే కాదన్నారు. పెరిగిన టెక్నాలజీతో ఒక గంట వ్యవధిలో మొత్తం సమాచారాన్ని ముందు పెట్టవచ్చన్నారు. దేశం మొత్తం మీద ఉన్న ఎస్‌బిఐ శాఖలకు గాను కేవలం వేళ్ళ మీద లెక్కగట్టగలిగే శాఖలకు మాత్రమే ఈ ఎన్నికల బాండ్లను అమ్మే అవకాశం కల్పించిందన్నారు. ఈ శాఖల పరిధిలో ఏ కంపెనీ ఎలక్షన్ బాండు కొనింది, ఏ రాజకీయ పార్టీ ఆ బాండ్ ను క్లైయిమ్ చేసుకుంది అనే వివరాలను చెప్పడానికి ఒకే ఒక గంట సమయం చాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం దిక్కరిస్తూ ఒక ప్రభుత్వ రంగ సంస్థ అయి కూడా కేవలం నరేంద్ర మోడీ అవినీతిని కాపాడేందుకోసమే వివరాలు వెల్లడించకుండా జాప్యం చేస్తుందన్నారు. మొదటినుండి కూడా అవినీతికి కారణమయ్యే ఈ ఎలక్షన్ బాండ్‌లను సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. భారతదేశంలో ఎలక్షన్ బాండ్లను స్వీకరించబోమని చెప్పిన ఏకైక పార్టీ సిపిఎం అని అన్నారు. సిపిఎం, ఎడిఆర్ సంస్థ , కాంగ్రెస్ పార్టీలు ముగ్గురు విడివిడిగా సుప్రీంకోర్టులో వేసిన కేసును సుప్రీంకోర్టు సుదీర్ఘంగా విచారించి ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. దేశంలో రూ.16 వేల కోట్ల ఎన్నికల బాండ్ల రూపంలో అమ్ముడుపోతే అందులో రూ.12 వేల కోట్లు బిజెపికే చేరాయన్నారు. దేశభక్తి పేరుతో పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చే నరేంద్ర మోడీ దేశంలోనే అత్యంత నీతిమాలిన నాయకుడిగా, బిజెపి నీతిలేని పార్టీగా అవతరించిందన్నారు. చట్టబద్ధమైన, నీతివంతమైన పాలన కోసం బిజెపిని 2024 ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండి.ఆనందబాబు, ఎండి అంజిబాబు, మారెల్ల విజయ్, వై.నగేష్, సి.గురు శేఖర్, పుల్లారెడ్డి, నగర నాయకులు సాయిబాబా, షరీఫ్, రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్, సుధాకరప్ప, అబ్దుల్లా, రంగప్ప, రాఘవేంద్ర, హుస్సేన్‌బాష, శంకర్ తోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



కర్నూలు ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

ముస్లింల పవిత్ర మాసం రంజాన్

- నేటి నుండి ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

నెలవంక కనబడడంతోనే రంజాన్ పవిత్ర మాసం ఉపవాస దీక్షలు నేటి నుండి ప్రారంభమవుతాయి. ముస్లింలకు పవిత్రమైనది రంజాన్ మాసం. ఈనెల ముస్లింల ఉపవాస దీక్షలకు ప్రతీకగా నిలుస్తుంది. రంజాన్ పండగ ప్రపంచ మానవాళిలో సోదర భావం కలుగజేస్తుంది. పవిత్ర ఖురాన్ గ్రంథం రంజాన్ మాసంలోనే అవతరించి ందని ముస్లిం మత పెద్దలు చెబుతారు. ఈ మాసం గొప్పతనానికి ప్రతీకగా ముస్లింలు భక్తి శ్రద్దలతో రోజా (ఉపవాసం) ఉంటారు. రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. సోమవారం రాత్రి మసీదుల్లో తరావి నమాజులు ఆచరించారు. రంజాన్ మాసంలో తెల్లవారకముందే భోజనం చేస్తారు. దీన్ని 'సహేరి'గా సంబోధిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఉపవాస దీక్షను విరమిస్తారు. దీన్ని 'ఇఫ్తార్ 'అంటారు. రంజాన్ నెల ప్రారంభమై ముగిసే వరకు ప్రతిరోజు ముస్లిములు 14 గంటల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఈ దీక్షలు కేవలం ఆహార పానీయాలు మానేయడం మాత్రమే కాదు, నిష్ఠ నియమాలతో కూడుకున్న జీవన విధానంతో ఉపవాసాలు ఉంటారు. స్త్రీ పురుష భేదం లేకుండా ముస్లింలు ఈ నెలలో ఉపవాసం ఉంటారు.

ముస్లిముల మూలస్తంభాలు : కలిమా, నమాజ్, రోజా జకాత్, హజ్. వీటిలో హజ్ తప్ప మిగతా నాలుగు మూల సూత్రాలు అమలయ్యేది రంజాన్ మాసంలోనే. ఆర్థిక స్తోమత కలవారు తప్పకుండా హజ్ యాత్రను సంపూర్ణం చేయాలి.

నియమాలు : ఖురాన్ ప్రకారం వయోనులైన స్త్రీ పురుషులు విధిగా రోజా (ఉపవాస దీక్ష)లను పాటించాలి. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ప్రయాణంలో ఉన్న వారికి మాత్రమే మినహాయింపు లభిస్తుంది. ఈ మాసమంతా శరీరానికే కాదు మనసుకు కూడా కళ్లెం వేయాల్సి ఉంటుంది. మంచి దృష్టితో చూడడం, మంచిని పాటించడం, చెడుకు దూరంగా ఉంటూ ఐదు పూటల నమాజు చేయాలి. నెల చివర్లో ప్రతి ముస్లిం ఫిత్రా దానం చెల్లించాలి. ఆర్థిక స్తోమత కలవారు జకాత్ దానం చేయాలి.

తరావిలో ఖురాన్ పఠనం : రంజాన్ మాసంలో ప్రతి మసీదులో తరావి నమాజ్‌లో ఖురాన్ పఠనం చేస్తారు. పవిత్ర ఖురాన్లో 30 పాఠాలు ఉంటాయి. రోజుకో పాఠం చొప్పున 30 రోజుల్లో 30 పాఠాలు పఠిస్తారు. ప్రతి మసీదులో రంజాన్ నెలలో ఒక హాఫీజ్ (ఖురాన్ కంఠస్థం చేసే వ్యక్తి)ను ఏర్పాటు చేసుకుని నెల మొత్తం సంపూర్ణంగా ఖురాన్ పఠనంతోనే తరావి నమాజులు చేయిస్తారు. ముస్లిం సోదరులంతా ఈ నెలలో పేదలకు దానధర్మాలు చేయడంలో ముందుంటారు.

ఎతేకాఫ్ : రంజాన్ నెల 21వ తేదీ నుంచి చివరి వరకు ఒకే రకమైన తపోనిష్టతో దైవ ధ్యానం, పవిత్ర ఖురాన్ పారాయణం చేయడంలో నిమగ్నమవుతారు. ఎతేకాఫ్‌లో ఉన్న వారు బలమైన కారణం ఉంటే తప్ప బయటికి పోకూడదు.

షబ్-ఏ-ఖద్(బడేరాత్) : రంజాన్ నెలలోని చివరి ఐదు బేసి రాత్రుల్లో (21,23,25,27,29) ఒక రాత్రి బడే రాత్. 27వ రాత్రి బడే రాత్ కావడానికి ఎక్కువ అవకాశం ఉంది.

జకాత్ : రంజాన్ నెలలో జకాత్‌కు అధిక ప్రాధాన్యం ఉంది. ఇది ప్రతి ముస్లిం విధి. ఆస్తిలో నుండి ఒక నిర్ణీత మొత్తాన్ని దానం చేయడాన్ని జకాత్ అంటారు. సంపన్నులు జకాత్ విధిని తప్పక నెరవేర్చాలని ఖురాన్ చెబుతుంది.

సన్నాహాలు పూర్తి : ఉపవాస దీక్షలు ప్రారంభం కావడంతో ముస్లిములు ఉప వాసాలకు సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. అన్ని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



రంజాన్ ప్రార్థనలకు ముస్తాబైన యూసుఫ్ మజీద్

14న కర్నూలుకు సీఎం రాక

- లా యూనివర్సిటీకి శంకుస్థాపన చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈనెల 14న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం భూమి పూజ నిమిత్తం కర్నూలుకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన పరిశీలించారు. సోమవారం జగన్నాథ గట్టుపై జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి మార్చి 14న ముఖ్యమంత్రి భూమి పూజ చేయనున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజలతో కలిసి హెలిప్యాడ్, వేదిక స్థలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హెలిప్యాడ్ దగ్గర , అవసరమున్న ప్రదేశాలలో బ్యారికేడింగ్ పనులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పైలాన్‌కు ఎదురుగా చదును చేసిన స్థలాన్ని ఇంకా చదును చేసి ముఖ్య అతిథులు ఒకవైపు , వేదిక ఎదురుగా దాదాపు 1000 మంది పైగా కూర్చునే విధంగా ఏర్పాటు, గ్రీన్ రూమ్ తదితరాలు కూడా ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజును కలెక్టర్ ఆదేశించారు. పైలాన్ అందరికీ స్పష్టంగా కనిపించే విధంగా వేదిక ఏర్పాటు చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య , కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ , ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు, అడిషనల్ ఎస్‌పి గుమ్మడి నాగబాబు , డిఎస్‌పి విజయ్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ , ఆర్‌డిఒ శేషి రెడ్డి , కల్లూరు తహశీల్దార్ మునివేలు , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పై స్పష్టత ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల నిర్వహణ, నియమావళి పై మీడియాకు స్పష్టత ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నిర్వహణ అంశాలపై మీడియా ప్రతినిధులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్, రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన విధానాలు, నియమాలపై కేవలం రిటర్నింగ్ అధికారులకు మాత్రమే కాకుండా పొలిటికల్ పార్టీలకు, మీడియా ప్రతినిధులకు కూడా స్పష్టత ఉండాలన్న ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ, ఎన్నికల నోటిఫికేషన్ తేదీ వేరువేరుగా ఉంటుందన్నారు. నోటిఫికేషన్ తేదీ నుండి నామినేషన్లు వేసుకోవచ్చన్నారు. నోటిఫికేషన్ తేదిన ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్‌ను పబ్లిష్ చేస్తామన్నారు. ఆ వెంటనే నామినేషన్‌లు వేసుకోవచ్చన్నారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నోటీస్ బోర్డ్, ఇతర ప్రముఖ ప్రభుత్వ కార్యాలయాల్లో నోటిఫికేషన్‌ను బోర్డ్‌లో ప్రదర్శిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి నియమావళి రాజకీయపార్టీలు, అభ్యర్థులు, పౌరులు, అధికారులు పాటించాల్సిన వివరాలను ఆమె వెల్లడించారు. మరోసారి పోలీసు అధికారులతో కలిపి సమావేశం నిర్వహిస్తామన్నారు. నోటిఫికేషన్ రాగానే ప్రజాప్రతినిధులు ప్రభుత్వ వాహనాలను, పిఎలను ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు. సెక్యూరిటీ రిత్యా ఒక ప్రధాన మంత్రికి మాత్రం మినహాయింపు ఉంటుందన్నారు. అభ్యర్థి మూడుకంటె ఎక్కువ వాహనాలను వాడితే అదనపు ఖర్చు ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చులో రూ.95 లక్షలు ఎంపీలు, రూ.45 లక్షలు ఎమ్మెల్యేలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. మనీ, గిఫ్టులు ఏమిచ్చినా మోడల్ కోడ్ కాండాక్టు (ఎంసిసి) కిందికి వస్తాయన్నారు. అలాంటి అభ్యర్థులపై చర్యలు తీసుకుంటామన్నారు. స్టార్ కాంపెయినర్లు వచ్చినా వారి ఖర్చులు అభ్యర్థి ఖర్చులోకి జమ అవుతాయన్నారు. ఎన్నికల నయమావలిని ఫాలో చేయడానికి ఆరు టీంలు ఉంటాయని వాటన్నింటికి శిక్షణ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ డెప్యూటీ డైరెక్టర్ జయమ్మ, జిల్లా బిసి సంక్షేమ అధికారి, మీడియా నోడల్ అధికారి వెంకట లక్ష్మమ్మ, జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్పందన అర్జీలను పరిష్కరించడంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుడు ఇచ్చిన అర్జీని బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా సరైన రీతిలో పరిష్కరించి అర్జీదారుడు సంతప్తి చెందేలా కృషి చేయాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేని అర్జీ అయితే అర్జీదారుడికి అర్థమయ్యే రీతిలో వివరించడంతో పాటు ఎందుకు పరిష్కరించలేమో అందుకు తగిన కారణాలను కూడా వారికి వివరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఒ కె.మధుసూదన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, జెసి నారపురెడ్డి మౌర్య

నగరాభివృద్ధి నా బాధ్యత

యువతకు ఉపాధి కల్పిస్తా-కర్నూలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే బాధ్యత తనదని కోడుమూరు కర్నూలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. సోమవారం ఆయన వైసిపి కర్నూలు నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని ఉన్నతచదువులు చదివి సిటిఒ, జిల్లా కలెక్టర్‌గా ఉత్తమ కీర్తిని సంపాదించానన్నారు. కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో కలెక్టర్‌గా సేవ చేశానన్నారు. ప్రజల కు అందుబాటులో ఉండి సేవ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి, కర్నూలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలన్నారు. దాంతో ఉద్యోగానికి రాజీనామా చేసి వైసిపిలో చేరానన్నారు. పార్టీలో తమ దంతా ఓకే అజెండా జెండాతో కలిసి ముందుకు సాగుతామన్నారు. కోడుమూరు 10వతరగతి వరకు చదివానని, ఇంటర్ కర్నూలులో చదివానని , గతంలో కర్నూలులో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేశానని చెప్పారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల ఇబ్బందులు అన్నీ తెలుసునని అన్నారు. ఉద్యోగంలో చేసిన సేవలకు పరిమితి ఉంటుందని ఎమ్మెల్యేగా విస్తృతంగా ప్రజాసేవ చేయడానికి వచ్చానని చెప్పారు. కర్నూలు వైసిపిలో ఎలాంటి విభేదాలకు తావు లేదన్నారు. రెండు రూపాయల డాక్టర్‌గా పేరుపొందిన డాక్టర్ ఇస్మాయిల్ ఆశీస్సులతో ముందుకు సాగుతానన్నారు. కర్నూల్లో ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధికి కషి చేస్తానని అన్నారు. బాధ్యత తీసుకుని యువతకు మహిళలకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తానన్నారు. జిల్లా కలెక్టర్‌గా సొంత జిల్లాలో ప్రజలకు సేవ చేసుకునే అవకాశం లభించలేదన్నారు. రాజకీయ ప్రవేశంతో ఆ అవకాశం ప్రస్తుతం లభించిందన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత సేవ చేస్తానని అన్నారు.

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు స్వస్తి : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలని టిడిపి పాణ్యం అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బాబు సూపర్ 6 సిక్స్ పథకాలను డోర్ టు డోర్ కార్యక్రమం కల్లూరు అర్బన్ 32వ వార్డ్ ముజఫర్ నగర్ వాటర్ ట్యాంక్ లైన్‌లలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటూ, పథకాల గురించి గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి టైలర్ నాగరాజు, వార్డ్ ముఖ్య నాయకుడు ఖాజ బందే నవాజ్, అర్బన్ వార్డ్ ఉపాధ్యక్షుడు బీచుపల్లి, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ యన్ వి రామకష్ణ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, తెలుగు యువత రాష్ట ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్‌తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ బద్ధ పాలనకోసం బిజెపిని ఓడించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్

దేశంలో రాజ్యాంగబద్ధ, నీతివంతమైన పాలన కోసం బిజెపిని దాని విధానాలకు రాష్ట్రంలో అమలు చేస్తున్న టిడిపి, వైసిపిను 2024 ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి తరిమికొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. సిపిఎం కర్నూలు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ బి.రామాంజనేయులు అధ్యక్షన జరిగింది. ఎంఎ గఫూర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఇండియాకూటమితో కలిసొచ్చే పార్టీలను గెలిపించాలని కోరారు. బిజెపి మతోన్మాద పోకడలతో దేశంలో ముస్లింలను, క్రిస్టియన్లను , దళితులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేస్తుందో అందరూ గమనిస్తున్నారని అందుకే ప్రజలు ఓటుద్వారా తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భారత రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాతంత్ర విలువలను కాపాడేందుకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో సిపిఎంను బలపరచాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, రాష్ట్ర కమిటీసభ్యులు పి.నిర్మల, కర్నూలు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కెవి.నారాయణ, నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, ఎ.నాగరాజు, సీనియర్ నాయకులు జిల్లా కమిటీ సభ్యులు , నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

ఉద్యోగ భద్రత కల్పించాలి


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : పాఠశాలల కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు పని భారం తగ్గించాలని, నైట్ వాచ్మెన్ లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జె. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట శానిటేషన్ వర్కర్స్ , నైట్ వాచ్మెన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా 22 జిఒ ప్రకారంగా టాయిలెట్స్ పరిశుభ్రతకు ఆయాలను నియమిస్తే కొంతమంది అధికారులు గంట కొట్టించటం మట్టి రాళ్లు సిమెంటు మోయించటం అటెండెన్స్ వేయించటం క్లాస్ గది వద్ద కూర్చోబెట్టి విద్యార్థులు అల్లరి చేయకుండా కాపలా పెట్టడం వంటి పనులను అప్పగిస్తున్నారన్నారు. నాడు నేడు కింద అన్ని రకాల పనులు వెట్టిచాకిరి చేయిస్తున్నారని వెట్టి చాకిరి చేయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి, ఫిబ్రవరి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నైట్ వాచ్మెన్‌ల సంఘం నాయకులు రాజు మాట్లాడుతూ ఆయాల వలె మాకు కూడా ఉద్యోగ భద్రత లేదని ఆయాలు వాచ్మెన్లు ఐక్యంగా ఉద్యోగ భద్రత సాధించుకోవాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చి పని భారంపై నిర్దిష్టమైన సర్క్యులర్సు పంపుతామన్నారు. వేతనాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆమె హామీ ఇచ్చారు.

ఇళ్లస్థలాల జిఒను అమలు చేయాలి

కలెక్టర్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జిఒను వెంటనే అమలు చేసి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటిస్థలం కేటాయించాలని, జిల్లాలో కమిటీలు ఇప్పటికే జాబితాలను తయారు చేశారని, ఫిబ్రవరిలో మరోవారం రోజులు దరఖాస్తుకు అవకాశం కల్పించడం ద్వారా మరికొందరు జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకున్నారని, తుది జాబితాను అమల్లోకి తేవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఆయా మండలాల్లో, జిల్లా కేంద్రంలో ఎంతభూమి అవసరమో అంచనాలు తయారుచేసి అందుబాటులో ఉన్న భూమి వివరాలను సేకరించాలని విజ్ఞప్తి చేశారు. భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ధర నిర్ణయం జరిగి జర్నలిస్టులు ఎంతమొత్తం, ఎప్పటిలోగా చెల్లించాలో కమిటీలు నిర్ణయిస్తే అందుకు అనుగుణంగా జర్నలిస్టులు సంసిద్ధులవుతారని పేర్కొన్నారు. ఆర్థికంగా బలహీనస్థితిలో ఉన్నవారు కనుక తగినంత సమయం ఇస్తే బాగుంటుందని తెలిపారు.కలెక్టర్ డాక్టర్ సజన మాట్లాడుతూ గార్గేయపురం దగ్గరలో 603 సర్వే నంబర్‌లో స్థలాన్ని పరిశీలించామని, ఆ స్థలానికి మైనింగ్ లీజు కూడా రద్దు చేయడం కోసం లేఖ రాశామన్నారు. త్వరలో లీజు రద్దు చేసి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో కూడా త్వరగా పట్టాలు అందించేందుకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ సీనియర్ నాయకులు బి.చిన్నరామాంజనేయులు, పానుగంటి చంద్రయ్య, బసప్ప , ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు టిజి.ప్రసాద్, జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర, జెఎసి చైర్మన్ సత్యన్న , చంద్రమోహన్, విజయ్‌కుమార్, నీలం సత్యనారాయణ, మల్లికార్జున, జి.రమేష్, బి.శివకుమార్, సునిల్‌కుమార్, సుజాత, శ్రీరామ్, బ్రహ్మయ్య, దామోదర్, రవి, ఎర్రమల, రాజశేఖర్, మధు, చెన్నయ్య, రమేష్, నరసింహ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి కనిపించదు

కర్నూలు, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు బి టి, మల్లెల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధించిన అభివృద్ధి సూన్యమని, కోడికత్తి డ్రామా, బాబాయి హత్య, ఇసుక, మద్యం, మైనింగ్, లిక్కర్, గంజాయి మాఫీయాలు, కూల్చివేతలు, ఆరాచకాలు, హత్యాచారాలు రాజ్య మేలుతున్నాయని కర్నూలు, నంద్యాల జిల్లాల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బిటి.నాయుడు, మల్లెల రాజశేఖర్ విమర్శించారు. సోమవారం వారిరువురు జిల్లా టిడిపి కార్యాలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిన్న మేదరిమెట్లలో జరిగిన సిద్ధం సభలో మాట్లాడిన తీరునుచూస్తే వారికి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, బిజెపి, జెఎస్‌పి పార్టీలతో పొత్తు పెట్టుకోవడంతో వెన్నులో వనుకుపుట్టి, మతిచెలించి ఇష్టమొచ్చిన రీతిలో మాట్లాడారని అన్నారు. రాష్ట్రంలో పట్టిసీమ, అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విదేశాల నుంచి పెట్టుబడులను రాబట్టి, పరిశ్రమల స్థాపనకు వారు చూపిన చొరవ అందరికీ తెలుసు అన్నారు. 2019లో కేవలం ఒక్క అవకాశమివ్వమని ప్రజలను ప్రాదేయపడినందునే, ప్రజలు జగన్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి అధికారమిచ్చారని అన్నారు.

స్పందనకు ఐదు వినతులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ మండలంలో ఆయా సమస్యల పరిస్కారం కోసం ఆయా బాధితుల నుండి ఐదు వినతులు స్వీకరించినట్లు తహసీల్దార్ డాక్టర్ అనుపమ సోమవారం పేర్కొన్నారు. ప్రతి సోమవారం ప్రతి వినతికి న్యాయం చేసేందుకే ఈ స్పందన అని సద్వినియోగం చేసుకువాలని ఆమె మీడియాలో పేర్కొన్నారు.

పిజియోథెరఫీని సద్వినియోగం చేసుకోవాలి

సిబెళగల్ : మండల కేంద్రంలో ప్రతి సోమవారం భవిత కేంద్రం నందు నిర్వహించే పిజియోథెరఫీని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు వీరేష్ పేర్కొన్నారు. సోమవారం సుమారు 8 మంది వికలాంగులకు పిజియో థెరఫీ ద్వారా చికిత్స అందించారు. ఇక్కడే అవసరమైన వారికీ తగు పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన డిఐజి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల, ఇడుపుల పాయలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సోమవారం వైఎస్ఆర్ కడప జిల్లాకు వచ్చారు. ఈ సంధర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని కడప ఎయిర్ పోర్టులో కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు ఘనంగా స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కోడ్ ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్

ఎన్నికల కోడ్ ఎప్పుడు వచ్చినా అధికారులందరూ సిద్ధంగా ఉండాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్నికల విధులపై ఆదోని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నోడల్ ఆఫీసర్లకు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటిపై త్వరలో జిల్లాస్థాయిలో నోడల్ ఆఫీసర్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు, 26 సెక్టోరల్, రూట్ ఆఫీసర్ టీమ్స్, 16 నోడల్ ఆఫీసర్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యాలయపు పరిపాలన అధికారి సిఆర్.శేషయ్య, తహశీల్దార్ హసీనా సుల్తానా, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ విజయ శేఖర్ వర్మ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వై.రామేశ్వర్ రెడ్డి, డిఎల్‌పిఒ పరిపాలన అధికారి వీరభద్రప్ప, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పాల్గొన్నారు.

టిడిపితోనే మైనారిటీలకు రక్షణ

- 10, 11వ వార్డుల్లో బీవీ ప్రచారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

టిడిపితోనే ముస్లిం, మైనారిటీలకు రక్షణ అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక 10, 11వ వార్డుల్లో 'బాబు ష్యూరిటీ, భవిషత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. బీవీ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. అవినీతి, అరాచక పాలన సాగిస్తున్న వైసిపిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైసిపి పాలనలో ముస్లిం, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. టిడిపి నాయకులు సుందర్ రాజు, సలాం, జహంగీర్, రామదాసు గౌడ్, రంగస్వామి గౌడ్, రూపా జగదీష్, ఇద్రుస్, వాల్మీకి సోమన్న, నాగరాజు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- వైసిపి నాయకులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


సీతారామిరెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని టిటిడి పాలక మండలి సభ్యులు, వైసిపి నాయకులు వై.సీతారామి రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు కోసిగి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డితో కలిసి కోసిగి మండలం పెద్దబొంపల్లిలో సచివాలయం, ఆర్‌బికె, దొడ్డి బెళగల్‌లో ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.30 లక్షలతో చేపట్టిన సిసి రోడ్లను, పల్లెపాడులో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, శాతనూరులో ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, కోసిగిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం, బాలుర ఉన్నత పాఠశాలలో రూ.2.14 కోట్లతో మౌళిక సదుపాయాలతో నిర్మించిన 10 అదనపు గదుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి గెలుస్తారని, తమ సోదరులు వై.బాలనాగిరెడ్డి నాలుగోసారి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'స్పందన'లో నిద్రలోకి జారుకున్న అధికారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


నిద్రమత్తులో ఉన్న ఇద్దరు అధికారులు

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఇద్దరు అధికారులు నిద్రలోకి జారుకున్నారు. 'స్పందన'లో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి కూడా నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జిదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. స్పందనలో పాల్గొన్న అధికారులు ఏపీడీ లోకేష్‌తోపాటు మరో అధికారి నిద్రలోకి జారుకున్నారు. స్పందనకు వచ్చిన ప్రజలు వారిని చూసి నవ్వుకున్నారు. ప్రజల సమస్యలు వారికి పట్టావా..., ప్రభుత్వం జీతాలు తీసుకుంటూ ఇలా అధికారిక కార్యక్రమంలో నిద్రపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

సరిహద్దుల్లో చేతివాటం..!

- అటు కర్ణాటక.. ఇటు ఆంధ్ర చెక్ పోస్టులకు మామూళ్లు ఇవ్వాల్సిందే...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటు ఆంధ్ర, అటు కర్ణాటక చెక్ పోస్టుల్లో మామూళ్లు ఇవ్వాల్సిందే... వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మండలంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన పెద్దహరివాణం గ్రామం వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అటు నుంచి మూడు కిలోమీటర్లు దాటేలోపు ఇటికేహాల్ గ్రామం వద్ద కర్ణాటక అధికారులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. మొత్తం మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు దాటేలోపు రెండు రాష్ట్రాల చెక్‌పోస్టులకు మామూలు ఇవ్వాల్సిందేనని డ్రైవర్లు వాపోతున్నారు. కర్ణాటకలో లోకసభ ఎన్నికలు, ఆంధ్రలో లోకసభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం పంపిణీలను అడ్డుకోవడానికి ఎన్నికల సంఘం సరిహద్దు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ చెక్ పోస్టు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చేయి తడపనిదే.. ఇటుగా వాహనం వెళ్లే పరిస్థితి లేదు. అది అక్రమ రవాణా అయినా.. సక్రమ రవాణా అయినా ముడుపులు చెల్లించుకోవాల్సిందే. లేదంటే ఓవర్ లోడ్ అనో.. లేదా మరేదో కారణం చెప్పి వాహనాన్ని సీజ్ చేస్తుంటారు. వాహనదారులు సైతం 'ఎందుకొచ్చిన గొడవ రా బాబు' అనుకుంటూ అధికారుల చేయి తడిపి వెళ్తున్నారు. అసలే ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు కాసులు కురుస్తున్నాయనే చెప్పాలి. అక్రమ సరుకులు, మద్యం, ఇతరత్రా జీరో దందాకు సంబంధించిన వాహనాలకు ఒక్కో వాహనానికి రూ.300 నుంచి రూ.1000 వరకు వసూలు చేసి వదిలేస్తున్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాలోకి ప్రవేశిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి చర్యలు చేపట్టాల్సిన చెక్ పోస్టు అధికారులు ముడుపులకు ఆశపడి వాహనాల తనిఖీ చేయకుండానే వదిలి పెడుతున్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల పెద్ద ఎత్తున మత్తు పదార్థాలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జోరుగా జీరో వ్యాపారం కొనసాగుతోంది. ఈ చెక్ పోస్టులో పనిచేసే కొంతమంది అధికారులు దండిగా సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

పోలీసులు, ఆర్‌టిఎ, అబ్కారీ చెక్‌పోస్టుల్లో దాదాపు 4 నుంచి 6గురు వరకు విధులు నిర్వహిస్తుంటారు. సరిహద్దులో చెక్‌పోస్టు మాముళ్లకు అడ్డాగా మారింది. ఇక్కడ పోలీసులు, ఆర్‌టిఎ, అబ్కారీ శాఖల అధికారులు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న శాఖలు చెక్‌పోస్టులను అడ్డాలుగా మార్చుకొని చేతివాటం ప్రదర్శిస్తున్నాయి. పైకం అందిస్తే చాలు ఏ వాహనమైనా దర్జాగా తరలిపోయే పరిస్థితి ఉంది. చెక్‌పోస్టులో రవాణా శాఖకు సంబంధించి ఎంవిఐ, ఎఎంవిఐలతో పాటు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 24 గంటలకో బృందం షిఫ్టుల పద్ధతిలో మారుతూ ఉంటుంది. ఆయా ప్రాంతాల నుంచి అటు, ఇటు సరుకులు తీసుకెళ్లే వాహనాలు తప్పనిసరిగా ఇక్కడ ఆగి పత్రాలపై ముద్ర వేయించుకొని వెళ్లాల్సి ఉంటుంది. వాహనాల్లో ఏ సరుకు, ఎంత సామర్థ్యంతో రవాణా అవుతుందో తనిఖీ చేయడం, పత్రాలు సరిచూడడం ఇక్కడి వారి బాధ్యత.

అసలు ఏం చేస్తున్నారు...

తనిఖీ కేంద్రం వద్ద వాహనం ఆగగానే సంబంధిత డ్రైవర్ అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి కాగితాలు చూపుతాడు. స్థాయిని బట్టి సొమ్ము చేతిలో ఉంచగానే వాహనాన్ని ముందుకు పంపిస్తారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతి చేస్తున్న సమయంలో కూడా అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాకు నాటుసారాను తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెక్‌పోస్టు దగ్గర అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ఇక్కడ పోస్టింగ్‌కు భలే డిమాండ్...

చెక్‌పోస్టు వద్ద పని చేసేందుకు ఎక్కువ మంది అధికారులు ఆసక్తి చూపుతారు. ఇక్కడ విధుల నిర్వహణ అదృష్టంగా భావిస్తారు. పోస్టింగ్ రావడానికి లేదా డిప్యూటేషన్‌పై పని చేయడానికి ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకొని మరీ డ్యూటీలు పొందుతుంటారు.


లారీ డ్రైవర్ వద్ద మామూలు వసూలు చేస్తున్న సిబ్బంది

నేడు చేనేత ఆత్మీయ సమ్మేళనం

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



నియోజకవర్గ స్థాయి చేనేత ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక కోరారు. సోమవారం ఆమె మాట్లాడారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో మంగళవారం చేనేత కార్మికుల ఆత్మీయ సమ్మేళన జరుగుతున్నట్లు తెలిపారు. సమ్మేళన సభకు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మనేకుర్తి గ్రామంలో సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆలూరు ఎఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు... మహ్మద్ సిద్ధిక్ అఫ్రిది (26) హోస్పేట్ నుంచి కెటిఎం బైక్‌పై ఆదోనికి వస్తుండగా, ఎమ్మిగనూరు రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన షఫీ, బోయ మల్లికార్జున ప్యాసన్ ప్రో బైక్‌పై ఆదోని నుంచి ఆలూరు వైపు వస్తుండగా మనేకుర్తి గ్రామంలో రెండు బైక్‌లూ ఢీకొన్నాయి. మహ్మద్ సిద్ధిక్ అఫ్రిది అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ఇద్దరిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.


మృతి చెందిన సిద్ధిక్ అఫ్రిది

సుప్రీం ఆదేశాలు పాటించకపోవడం రాజ్యాంగ విరుద్ధం

- సిపిఎం నాయకులు గోవిందు, రాముడు
- ఎస్‌బిఐ ముందు నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం నాయకులు పి.గోవిందు, బి.రాముడు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోడీ నాయకత్వంలో ఎన్నికల నిర్వహణ పేరుతో ఎన్నికల బాండ్లను సేకరించి ఆ డబ్బుతో ఓట్లు కొని, మళ్లీ అధికారంలోకి రావడానికి సిద్ధమైందని విమర్శించారు. సోమవారం స్టేట్ బ్యాంకు ఇండియా మెయిన్ బ్రాంచి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్లను రద్దు చేసిందని తెలిపారు. ఎన్నికల బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గోప్యంగా ఉంచడం సిగ్గుచేటని చెప్పారు. ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఎస్‌బిఐ ఆ వివరాలను వెల్లడించకుండా కేంద్రానికి తలొగ్గిందని విమర్శించారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాపై మోడీ ప్రభుత్వ ఒత్తిడి నేపథ్యంలోనే వివరాలు వెల్లడించడానికి జూన్ వరకు సమయం కోరిందని తెలిపారు. ఏప్రిల్, మే మాసంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల బాండ్ల వివరాలను గోప్యంగా ఉంచడం పరోక్షంగా బిజెపికి సహకరించడమేనని చెప్పారు. ఎన్నికల బాండ్లను ఉపయోగించుకొని ఆ డబ్బుతో ఓట్లు కొని బిజెపి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఇప్పటికైనా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు లక్ష్మీ నరసయ్య, కృష్ణ, రాజు, నాగరాజు, చంద్ర, శంకర్, ముక్తార్, మాదన్న, రాముడు పాల్గొన్నారు. **ఆలూరు** ఎస్‌బిఐ ముందు నిరసన తెలియజేసి, బ్యాంకు మేనేజర్ ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం తాలూకా నాయకులు కెపి.నారాయణస్వామి, సిపిఎం నాయకులు ఈరన్న, నాగరాజు, వీరేష్, విఠల్, గోపాల్, మైనా, గోవర్ధన్, గౌసియా పాల్గొన్నారు. **ఆస్పరి** ఎస్‌బిఐ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ మద్దిలేటికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బాలకృష్ణ, రంగస్వామి, రామాంజనేయులు, నాయకులు ఈరన్న, బడే సాహెబ్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మహిళా సాధికరతకు జగన్ కృషి

- ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - నందవరం

మహిళా సాధికరతపై ఇంతగా దృష్టి పెట్టిన ఏకైక నేత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. సోమవారం నందవరంలో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం 4వ విడత నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హాజరయి 3,723 మంది మహిళలకు రూ.6.98 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 45 నుంచి 60 ఏళ్ల వయస్సు గల మహిళలకు సరైన ఆర్థిక చేయూతనిస్తే, వారి కుటుంబం, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని నమ్మి, వైఎస్ఆర్ చేయూత' పథకాన్ని ప్రవేశపెట్టి, ఏటా రూ.18,750 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతూ, మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగుతోందని చెప్పారు. ఎసి శ్రీనివాసులు, ఎపిఎం వీరన్న, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, వైసిపి సీనియర్ నాయకులు బసిరెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, శివారెడ్డి గౌడ్, ముగతి విరుపాక్షి రెడ్డి, జడ్‌పిటిసి నిఖిల్ పాల్గొన్నారు. **గోనెగండ్లలో** 4వ విడత వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హాజరై 4,351 మంది మహిళలకు రూ.8.15 కోట్ల చెక్కును అందజేశారు. వైసిపి తాలూకా నాయకులు బిఆర్.బసిరెడ్డి, ఎంపిపి నసురుద్దీన్, మండల యూత్ ప్రెసిడెంట్ బందేనవాజ్, మండల కన్వీనర్ దొరబాబు, వైస్ ఎంపిపి వెంకట్రామిరెడ్డి, సొసైటీ వైస్ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, పద్మనాభం, రఫీక్, నదీముల్లా, నాగలదిన్నె మహ్మద్, ఉల్చాల రంగన్న నాయుడు, వెంకటరెడ్డి, ఇఒఆర్‌డి నాగేష్, ఎసి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జీ ఎపిఎం ముక్కన్న, సిసిలు లలితా రాణి, శకుంతల, వీరకృష్ణుడు, వెంగన్న, మధు పాల్గొన్నారు.


నందవరంలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


గోనెగండ్లలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

బేడ, బుడగ జంగాల అభివృద్ధికి కృషి

- వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ పరిధిలోని బేడ, బుడగ జంగాల అభివృద్ధికి కృషి చేస్తామని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక రాఘవేంద్ర పురంలోని బేడ, బుడగ జంగాలకు చెందిన కమిటీ హాలును ప్రారంభించారు. బంగారుబాబు ఇంటి వద్ద నుంచి కమిటీ హాలు వరకు వై.ప్రదీప్ రెడ్డికి పూల వర్షం కురిపిస్తూ, డప్పు దరువుల మధ్య, బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. బేడ బుడగ జంగం కమిటీ హాలును రిబ్బన్ కట్ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వై.ప్రదీప్ రెడ్డికి గజమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, జనార్ధన్ రెడ్డి, బొంబాయి శివ ఉన్నారు.


హాలును ప్రారంభిస్తున్న ప్రదీప్ రెడ్డి

వైభవంగా కనకదాసు విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి

కౌతాళం : పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహావిష్కరణను వైభవంగా నిర్వహించారు. సోమవారం విగ్రహ కమిటీ అధ్యక్షులు శివారమ్, ఎంపిపి అమ్రేష్, కురువ సంఘం నాయకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, గంగి పూజ, గోపూజతో శ్రీకనకదాసు విగ్రహావిష్కరణ వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో కురువలకు సముచిత స్థానం కల్పించామన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం శ్రీకనకదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. వైసిపిపి నాయకులు దాట్ల కృష్ణంరాజు, వీర సేనా రెడ్డి, దేశాయి ప్రహ్లాద చారి, ఏకం రెడ్డి, బుజ్జిస్వామి, పాల్ దినకరన్, మాబు సాబ్, ఓంకార్ రెడ్డి, హాల్వి చెన్నప్ప, శివన్న పాల్గొన్నారు.

యువతను మోసగించిన జగన్

- టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అధికారంలోకి రాగానే మొట్టమొదట ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పి యువతను మోసం చేశారని టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ విమర్శించారు. నేడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో మోసం చేయడానికి సిద్ధం పేరుతో ముందుకు రావడం సిగ్గుచేటని తెలిపారు. సోమవారం పట్టణంలోని లక్ష్మణ్ టాకీస్ ఏరియా, నెహ్రూ నగర్‌లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'పై ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను ఓడించి చంద్రబాబుకు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేసి ముఖ్యమంత్రి జగన్ నిరుద్యోగ యువతను మోసం చేశారని తెలిపారు. నేడు మెగా డీఎస్సీ పేరుతో కేవలం 6,100 ఉద్యోగాలు విడుదల చేశారని మండిపడ్డారు. ఐదేళ్ల జగన్ విధ్వంస పాలనలో పారిశ్రామిక రంగం పూర్తిగా ధ్వంసమైందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రంలో పసుపు జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, తెలుగు మహిళా నాయకులు గోకారమ్మ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇప్పె నరసప్ప, కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్, రోజా ఆర్ట్స్ ఉసేని, కంపాడు చిన్న రంగన్న, మైనార్టీ నాయకులు గోరా బాష, జోహార్ అబ్బాస్, ధన, కామర్తి గంగాధర్ పాల్గొన్నారు.


ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న సోమనాథ్

రామిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

- వర్ధంతి కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి వాల్మీకి రామిరెడ్డి కుటుంబానికి పాలకుర్తి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం రామిరెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా వగరూరు గ్రామంలో ఆయన సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్, యువనాయకులు పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, లింగప్ప, దస్తగిరి, ఏసన్న, ప్రతాప్ పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకులు శివరామ్‌కు పరామర్శ

ఇటీవల ద్విచక్ర వాహనం పైనుంచి పడి చికిత్స పొంది గ్రామానికి చేరుకున్న టిడిపి సీనియర్ నాయకులు శివరామ్‌ను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని వి.తిమ్మాపురం గ్రామంలోని శివరామ్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, కేశవ్, వగరూరు అబ్దుల్, దస్తగిరి పాల్గొన్నారు.

సొంత వ్యాపారులు నష్టపోకూడదు

- హోళగుంద మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - హోళగుంద

స్థానికేతర వ్యాపారుల వల్ల సొంత గ్రామ వ్యాపారులు నష్టపోకూడదన్నదే తమ లక్ష్యమని హోళగుంద మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు డిష్ మంజు, ఎస్ఎస్‌వి.షబ్బీర్, ఎస్‌కెఎస్.గోపాల్ తెలిపారు. సోమవారం స్థానిక రవి కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హోళగుంద మర్చంట్స్ అసోసియేషన్ తరపున ఒక కమిటీని ఏర్పాటు చేసి రాబోయే కాలంలో స్థానికేతర వ్యాపారుల వల్ల తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హోళగుంద మర్చంట్స్ అసోసియేషన్‌ను రిజిస్ట్రేషన్ చేయించి అందులో కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

హోళగుంద మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

గౌరవాధ్యక్షులుగా కాళికా ప్రసాద్, అధ్యక్షులుగా డిష్ మంజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్‌సి.మంజునాథ్, సెక్రటరీగా కాకి శ్రీరాములు, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కెఎస్.గోపాల్ శెట్టి, ట్రెజరర్‌గా శాలి షబ్బీర్‌తోపాటు ఈసీ మెంబర్లుగా అమరేశప్ప, జాంటీ వీరేష్, ఇమామ్ బాష, గాజుల బాష, యూనుస్, సతీష్ మార్వాడి, వెంకన్న శెట్టి, రాము, రామ్మోహన్, రాజ్‌కుమార్, పత్తారి శీను, ముజామిల్, ఇర్ఫాన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ మెంబర్లుగా ఎన్నికైన వారందరినీ శాలువాలు, పూలమాలతో సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి

- వైసిపి యువ నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

గ్రంథాలయాన్ని ప్రజలు, యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి కోరారు. సోమవారం నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూ.20 లక్షలతో నూతన శాశ్వత భవనం నిర్మించినట్లు తెలిపారు. అనంతరం నాడు-నేడు నిధుల కింద రూ.22 లక్షలతో కన్నడ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. వైసిపి మండల నాయకులు కృష్ణంరాజు, వీర సేనా రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఓంకార్ రెడ్డి, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం, ఎంఇఒ శోభారాణి, గ్రంథాలయ అధికారి మధులీన పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రదీప్ రెడ్డి


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా ప్రతూల్

బుట్టా రేణుకకు మద్దతు ఇవ్వాలి

- వైసిపి యువ నాయకులు బుట్టా ప్రతూల్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తమ తల్లి బుట్టా రేణుకకు మద్దతు ఇవ్వాలని వైసిపి యువ నాయకులు బుట్టా ప్రతూల్ కోరారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన గొప్ప నేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. సోమవారం పట్టణంలోని 4వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి కార్యకర్తనూ కలుస్తూ పర్యటించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను గెలిపించాలని కోరారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, 1వ వార్డు కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప పాల్గొన్నారు.

శ్రీబీరలింగేశ్వర స్వామి దేవర ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నీహళ్లి గ్రామంలో వెలసిన శ్రీబీరలింగేశ్వర స్వామి దేవరను ఆలయ పూజారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున తుంగభద్ర నదిలో చెట్నీహళ్లి గ్రామానికి చెందిన అళ్లింగప్ప స్వామి పల్లకి, పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన యాతగిరప్ప స్వామి పల్లకి, ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన వన్నికెరప్ప స్వామి పల్లకి మూడు కలిసి తుంగభద్ర నదిలో ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఊరేగింపు గ్రామ చావిడి మీదుగా భక్తులు డోళ్లతో, ఆట కలాట, పాటలు, పిల్లనగ్రోవి వంటి నృత్యాలు చేస్తూ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి చేరుకున్నారు. దేవరకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


మాట్లాడుతున్న షేకున్ బీ

మహిళా చట్టాలను అమలు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-ఆలూరు

మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా మండల అధ్యక్షులు షేకున్ బీ కోరారు. సోమవారం స్థానిక జ్యోతి బసు భవన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా ఇంకా మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. దాడులను అరికట్టలేక పోతున్నారన్నారు. మహిళలపై దాడులను అరికట్టాలని, పొదుపు గ్రూపుల్లో ప్రతి సంఘానికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు గౌస్ బీ, భారతి, రాధమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.





నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన గ్రంథాలయం

ఎలక్ట్రోల్ బాండ్స్ బయట పెట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్
- ఎస్‌బిఐ వైఖరిని నిరసిస్తూ నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, ఏ.కోడూరులలోని బ్యాంక్‌ల ఎదుట ధర్నా



ఎస్‌బిఐ ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న రాజకీయ పార్టీల ఎలక్ట్రోల్ బాండ్లను తక్షణమే బయటపెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఎలక్ట్రోల్ బాండ్లను బయటపెట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ సెంటర్‌లో ఉన్న ఎస్‌బిఐ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం పట్టణ నాయకులు డి.లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ 2019 నుండి 2023 వరకు దేశవ్యాప్తంగా కార్పొరేట్ సంస్థలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఎలక్ట్రోల్ బాండ్స్‌ని దేశంలో ఉన్న రాజకీయ పార్టీలకు ఇచ్చాయని అన్నారు. దీనిపై సుప్రీంకోర్టు విచారించాలని సిపిఎం ఆధ్వర్యంలో కోరామన్నారు. సుప్రీంకోర్టు దీనిపైన విచారించి ఈ ఎలక్ట్రాన్ బాండ్స్ రాజ్యాంగ విరుద్ధమని, ఇది అవినీతికి తావిస్తుందని, క్విడ్ ప్రోకో జరుగుతుందని తేల్చిందన్నారు. 16 రోజుల్లోగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎలక్ట్రోల్ బాండ్స్ ఎవరి వద్ద నుంచి తీసుకున్నారు, ఎవరెవరికి ఇచ్చారు తదితర వివరాలు బయట పెట్టాలని సుప్రీం ఆదేశించిందన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రం వివరాలు ఇవ్వాలంటే 116 రోజుల గడువు కావాలని సుప్రీంకోర్టుకు తెలిపిందన్నారు. కోర్టు తీర్పును ధిక్కరించిన బ్యాంకు అధికారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారి కేంద్ర బిజెపి ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఎలక్ట్రోల్ బాండ్స్‌లో 80 శాతం బిజెపికి అందాయని, వాటి వివరాలు తెలిపితే ఆ పార్టీ బండారం బయటపడుతుందని, కావున కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఎస్‌బిఐ తొత్తులా వ్యవహరిస్తుందని అన్నారు. లక్ష కోట్ల రూపాయలతో బ్యాంకును డిజిటలైజ్డ్ చేసి ఒక బటన్ నొక్కితే వివరాలన్నీ వస్తాయన్నారు. బిజెపి అవినీతి బయట పడుతుందనే ఉద్దేశ్యంతోనే వివరాలు సేకరించడానికి 116 రోజులు గడువు కోరారన్నారు. కార్పొరేట్ సంస్థలకు బిజెపి లబ్ధి చేకూరుస్తూ, ఆ సంస్థల ద్వారా ఎలక్ట్రోల్ బాండ్స్ కొనిపించి, బిజెపికి ఫండ్‌గా తీసుకుంటూ రాజకీయ అవినీతికి మిగతా 6వ పేజీలో...

నత్త నడకన గ్రంధాలయ నిర్మాణం

- దాదాపు ఏడాది అవుతున్నా పూర్తి కాని పనులు
- అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో నిర్వహణ - ఇబ్బందులు పడుతున్న పాఠకులు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండల కేంద్రంలో చేపట్టిన గ్రంధాలయ నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు ఏడాది అవుతుఅన్న భవన నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాములపాడు మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాల నుండి గ్రంధాలయ నిర్వహణ అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఇరుకు గదుల్లో సరైన వసతులు లేక పాఠకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత గ్రంధాలయ అధికారి కృష్ణారెడ్డి కూడా ఇరుకు గదుల మధ్యన కొన్ని ఇబ్బందులతో నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణం కోసం రెండు సంవత్సరాల క్రితం జిల్లా గ్రంధాలయ సంస్థ నుండి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయి. 2023 జూలై నెలలో కాంట్రాక్టర్ నూతన గ్రంధాలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు నత్తనడకన సాగుతుండడంతో ఎప్పటికి పూర్తవుతుందోనని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా సంవత్సరం అవుతున్నప్పటికీ గ్రంధాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి సంబంధిత అధికారులు ఈ విషయంపై తక్షణ చర్యలు చేపట్టి గ్రంధాలయ భవన నిర్మాణానికి త్వరగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ. 20 లక్షలు జమ చేశాం
- జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్



పాములపాడు గ్రంధాలయ భవన నిర్మాణా నికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ పూర్తి అమౌంట్‌ను ఎపి ఈడబ్ల్యుఐడిసి డిపార్ట్మెంట్ వారికి అప్పుడే ఖాతాలో జమ చేశాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై పలు దఫాలు డిపార్ట్‌మెంట్ అధికారులకు కూడా తెలియపరిచాం.

నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి
- ఎ.చంద్రశేఖర రావు, పాములపాడు.



రూ. 20 లక్షల నిధులు మంజూరైనా గ్రంధాలయ నిర్మా ణాన్ని కాంట్రాక్టర్ పూర్తి చేయక పోవడంపై అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కనిపిస్తుంది. ఉన్నత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- స్వామి అమ్మవార్లకు అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాలలో 11వ రోజున స్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను వివిధ పూలతో అలంకరించిన అశ్వ వాహనంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో వేదమంత్రాల మధ్య ఆలయ ప్రాంగణంలో అశ్వ వాహన సేవ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు వివిధ రకాల పూలతో ఏర్పాటుచేసిన పుష్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్లకు ఏకాంత సేవలో శయనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులను అలరించేందుకు నిత్య కళావేదిక వద్ద హరికథ, భక్తి రంజని కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మహానందిలో అంబరాన్నంటిన వసంతోత్సవం

మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకొని రుద్రగుండం పుష్కరిణిలో త్రిశూల చండీశ్వర స్నానం ఘనంగా మిగతా 6వ పేజీలో...



అశ్వవాహనంపై గ్రామోత్సవంలో స్వామి అమ్మవార్లు

ముస్లింల పవిత్ర మాసం రంజాన్

- నెలవంక దర్శనం - నేటి నుండి ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

నెలవంక కనబడడంతో రంజాన్ పవిత్ర మాసం ఉపవాస దీక్షలు నేటి నుండి ప్రారంభమవుతాయి. ముస్లిములకు పవిత్రమైనది రంజాన్ మాసం. ఈ నెల ముస్లిముల ఉపవాస దీక్షలకు ప్రతీకగా నిలుస్తుంది. రంజాన్ పండగ ప్రపంచ మానవాళిలో సోదర భావం కలుగజేస్తుంది. పవిత్ర ఖురాన్ గ్రంధం రంజాన్ మాసంలోనే అవతరించిందని ముస్లిం మత పెద్దలు చెబుతారు. ఈ మాసం గొప్పతనానికి ప్రతీకగా ముస్లిములు భక్తి శ్రద్ధలతో రోజా(ఉపవాసం) ఉంటారు. రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. సోమవారం రాత్రి మసీదుల్లో తరావి నమాజులు ఆచరించారు. రంజాన్ మాసంలో తెల్లవారకముందే భోజనం చేస్తారు. దీన్ని 'సహేరి'గా సంబోధిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఉపవాస దీక్షను విరమిస్తారు. దీన్ని 'ఇఫ్తార్ 'అంటారు. రంజాన్ నెల ప్రారంభమై ముగిసే వరకు ప్రతిరోజు ముస్లిములు 14 గంటల పాటు కఠిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఈ దీక్షలు కేవలం ఆహార పానీయాలు మానేయడం మాత్రమే కాదు, నిష్ట నియమాలతో కూడుకున్న జీవన విధానంతో ఉపవాసాలు ఉంటారు. స్త్రీ పురుష భేదం లేకుండా ముస్లింలు ఈ నెలలో ఉపవాసం ఉంటారు.

ముస్లిముల మూలస్తంభాలు : కలిమా, నమాజ్, రోజా జకాత్, హజ్. వీటిలో హజ్ తప్ప మిగతా నాలుగు మూల సూత్రాలు అమలయ్యేది రంజాన్ మాసంలోనే. ఆర్థిక స్తోమత కలవారు తప్పకుండా హజ్ యాత్రను సంపూర్ణం చేయాలి.

నియమాలు : ఖురాన్ ప్రకారం వయోనులైన స్త్రీ పురుషులు విధిగా రోజా (ఉపవాస దీక్ష)లను పాటించాలి. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ప్రయాణంలో ఉన్న వారికి మాత్రమే మినహాయింపు లభిస్తుంది. ఈ మాసమంతా శరీరానికే కాదు మనసుకు కూడా కళ్లెం వేయాల్సి ఉంటుంది. మంచి దృష్టితో చూడడం, మంచిని పాటించడం, చెడుకు దూరంగా ఉంటూ ఐదు పూటల నమాజు చేయాలి. నెల చివర్లో ప్రతి ముస్లిం ఫిత్రా దానం చెల్లించాలి. ఆర్థిక స్తోమత కలవారు జకాత్ దానం చేయాలి.

తరావిలో ఖురాన్ పఠనం : రంజాన్ మాసంలో ప్రతి మసీదులో తరావి నమాజ్‌లో ఖురాన్ పఠనం చేస్తారు. పవిత్ర ఖురాన్లో 30 పాఠాలు ఉంటాయి. రోజుకో పాఠం చొప్పున 30 రోజుల్లో 30 పాఠాలు పఠిస్తారు. ప్రతి మసీదులో రంజాన్ నెలలో ఒక హాఫీజ్ (ఖురాన్ కంఠస్థం చేసే వ్యక్తి)ను ఏర్పాటు చేసుకుని నెల మొత్తం సంపూర్ణంగా ఖురాన్ పఠనంతోనే తరావి నమాజులు చేయిస్తారు. ముస్లిం సోదరులంతా ఈ నెలలో పేదలకు దానధర్మాలు చేయడంలో ముందుంటారు.



రంజాన్ ప్రార్థనలకు ముస్తాబైన యూసుఫ్ మజీద్

ఎతేకాఫ్ : రంజాన్ నెల 21వ తేదీ నుంచి చివరి వరకు ఒకే రకమైన తపోనిష్టతో దైవ ధ్యానం, పవిత్ర ఖురాన్ పారాయణం చేయడంలో నిమగ్నమవుతారు. ఎతేకాఫ్‌లో ఉన్న వారు బల మైన కారణం ఉంటే తప్ప బయటికి పోకూడదు.

షబ్-ఏ-ఖద్(బడేరాత్) : రంజాన్ నెలలోని చివరి ఐదు బేసి రాత్రుల్లో (21,23,25,27,29) ఒక రాత్రి బడే రాత్. 27వ రాత్రి బడే రాత్ కావడానికి ఎక్కువ అవకాశం ఉంది.

జకాత్ : రంజాన్ నెలలో జకాత్‌కు అధిక ప్రాధాన్యం ఉంది. ఇది ప్రతి ముస్లిం విధి. ఆస్తిలో నుండి ఒక నిర్ణీత మొత్తాన్ని దానం చేయడాన్ని జకాత్ అంటారు. సంపన్నులు జకాత్ విధిని తప్పక నెరవేర్చాలని ఖురాన్ చెబుతుంది.

సన్నాహాలు పూర్తి : ఉపవాస దీక్షలు ప్రారంభం కావడంతో ముస్లిములు ఉప వాసాలకు సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. అన్ని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

ప్రజల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. సోమవారం డోన్ పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీస్ దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే స్టేషన్ మేనేజర్‌కి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణంలో రైల్వే ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం జరుగుతుందని, కొండపేట నుండి ప్రజలు, స్కూల్ విద్యార్థులు పాతపేటలోని స్కూలు, దేవాలయాలకు వెళ్లాలన్నా, ప్రార్థనా మందిరాలకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటాల్సి వస్తుందన్నారు. కొండ పేటకు పాతపేటకు అనుసంధానం ఉంచాలన్నా కొండపేట చర్చి దగ్గర, మసీదు దగ్గర మనుషులు వెళ్ళుటకు దారి ఇవ్వాలని, ముఖ్యంగా పాతపేట స్కూల్ వెళ్ళుటకు విద్యార్థులకు చాలా ఇబ్బందికరంగా ఉన్నందున ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఊడుమాల్పురంలో వైసిపికి షాక్

- వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలం ఊడుమాల్పురం గ్రామంలోని వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. పైరెడ్డి శివ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ జ్వాల తిరుమలేష్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు జ్వాల నాగేంద్ర, కేశవరెడ్డి, రాముతో పాటు 30 కుటుంబాలు సోమవారం నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ ఉడుమాల్పురం గ్రామాన్ని అభివృద్ధి చేసింది టిడిపి హయాంలోనే అని, వైసిపి హామీలకే పరిమితం అయిందన్నారు.



ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నందున అధికారులకు కేటాయించిన విధులు తూచా తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్ఆర్ సెంటినరీ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఓ ఎ.పద్మజ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు సత్వర పరిష్కార మార్గాలు చూపేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. స్పందన సమస్యలను నాణ్యతతో పరిష్కరించడంతో పాటు ఏ ఒక్క దరఖాస్తు రీఓపెన్ కాకుండా చూసుకోవాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం దొరకని సమస్యలకు సరైన కారణాలను ఎండార్స్ చేస్తూ అర్జీదారులకు అర్థమయ్యే రీతిలో వివరించా లన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో అధికారులకు అప్పగించిన విధులు నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేశారని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 14న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన కూడా విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 111 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



స్పందనలో కలెక్టర్‌కు అర్జీలు అందజేస్తున్న ప్రజలు



గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

రైతుల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు : రైతుల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో రూ. 75 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదామును, అలాగే బాపనంతపురం గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గోదామును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు గోదాములలో దాచుకునేందుకు వీలుగా వీటిని కట్టించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పిటిసి శంకర్ రెడ్డి. సింగల్ విండో అధ్యక్షుడు సురేష్. మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి. సింగల్ విండో కార్యదర్శి నాగేశ్వరరావు. రాజేష్ ఆయా గ్రామాల ఎంపిటీసీలు, సర్పంచులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బిసి జెఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో కార్మిక బీమా పథకాన్ని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ఆయన సతీమణి బిసి ఇందిరాలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 25 లక్షలు సొంత నిధులతో కార్మికుల బీమా పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయాలకతీతంగా ప్రారంభించామని చెప్పారు. గౌండా కార్మికులు, పాలిష్ కట్టింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రిషియన్లు, ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, ఆటో మొబైల్ మెకానిక్‌లు, టైలర్స్ వంటి వృత్తి పనులు చేసుకునే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20 వేలు తక్షణ ఆర్థిక సహాయం, మరణించిన వారి కుటుంబాలకు రూ.1 లక్ష పరిహారం వెంటనే అందజేస్తామన్నారు. కార్మికులు బీసీ జేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ కమిటీ సభ్యుల ద్వారా, నేరుగా సభ్యత్వం తీసుకొనుటకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన కార్మికులు ట్రస్ట్ ఆఫీసు సిబ్బందిని మాధవరెడ్డి-917778235, దస్తగిరి-7680874408ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఉప సర్పంచి బురానుద్దీన్, కార్పెంటర్ షబ్బీర్ గౌండా, మహబూబ్ బాషా, బాబు, కార్మికులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్మిక బీమాను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బిసి ఇందిరా

గుడిసెలకు ఇళ్ల పట్టాలివ్వాలి

- విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, లేదా పొజిషన్ సర్టిఫికేట్ అయినా ఇచ్చి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డికి, డిప్యూటీ తాసిల్దార్ సిపిఎం నాయకులు భాస్కర్ రెడ్డి, పకీర్ సాహెబ్, గోపాలకృష్ణ, కర్ణ, శ్రీనివాసులు, ఓబులేసు, నాగన్న తదితరులతో కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో 2009 నుండి 300 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, కొన్ని కుటుంబాల వరకు మాత్రమే కరెంటు స్తంభాలు వేసి విద్యుత్ మీటర్లు ఇచ్చారని తెలిపారు. మంచినీటి పైప్లైన్ హాఫ్ ఇంచు పైపు వేయడం వల్ల నీటి కొరత ఏర్పడుతుందన్నారు. కాలనీకి ఉపయోగపడే పద్ధతిలో మంచినీటి పైపులు ఏర్పాటు చేయాలని, కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయారాని, ఏసేపు, మధు, నాగ స్వామి, యాకోబు, మద్దమ్మ, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జర్నలిస్టులకు మూడుసెంట్ల స్థలం అందించేందుకు తుది జాబితాను వెంటనే విడుదల చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆళ్లగడ్డ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులకు సత్వరమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం ఆళ్లగడ్డ రెవెన్యూ కార్యాలయంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దారు నజీర్ అహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం అందించేందుకు మొదటి జాబితా తయారు చేశారని, అయితే ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవడానికి మరొక అవకాశం ఇవ్వడంతో మరికొందరు జర్నలిస్టులు దరఖాస్తు చేశారని, తుది జాబితాను విడుదల చేయాలన్నారు. వినతిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తహశీల్దారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆళ్లగడ్డ తాలుకా అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు ముల్లా నిజాముద్దీన్, కోశాధికారి వై.నాగరాజు, జర్నలిస్టులు ప్యాపిలి ప్రసాద్, మహమ్మద్ రఫీ, అక్షింతల శ్రీనివాసులు, అరుణ్, టీవీఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్రా రెడ్డి, నరసింహారెడ్డి, మండల గౌరవాధ్యక్షులు ఎం.రఘు రామిరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాఘవేంద్ర, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్యలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అర్హులైన జర్నలిస్టుల జాబితాను ప్రకటించి ఇళ్ల స్థలాలు ఎన్నికల కోడ్ రాకముందే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ బనగానపల్లె డివిజన్ కార్యదర్శి షాషావలి, మండల ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, మధు, మండల కార్యదర్శి రాజేష్, నాయకులు ఓబులేసు, సుధాకర్, దాదా పీరా తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం



ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - వెలుగోడు : వెలుగోడులో జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డిలు సోమవారం పంపిణీ చేశారు. అంతకు ముందు రేగడగూడూరు గ్రామంలో రూ. 75 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదామును, బీసీ కాలనీలో జిజిఎంపి నిధులు రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన పైపులైను, రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్వాడి సెంటర్‌ను ఎమ్మెల్యే, ఎంపీలు ప్రారంభించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సెంటున్నర స్థలం ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. రాబోయే రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ప్రతిపక్ష నాయకుల కల్లబొల్లి మాటలు ఎవరు నమ్మొద్దని అన్నారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపిపి లాలం రమేష్,, సర్పంచ్ జయపాల్, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

- స్త్రీ, శిశు సంక్షేమ శాఖా పీడీ నిర్మల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని వివిధ పోస్టులకు గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ, తిరిగి మళ్లీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమాభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న సఖి-వన్ స్టాప్ సెంటర్ (మిషన్ శక్తి-సంబల్)లో ఖాళీల భర్తీకి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 2న పోస్టులకు నిర్వహించిన అర్హత పరీక్షలో అభ్యర్థినులు ఎవరూ కనీస అర్హత సాధించలేక పోయారని తెలిపారు. కావున ఫిబ్రవరి 5న స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని సఖి-వన్ స్టాప్ సెంటర్ (మిషన్ శక్తి-సంబల్)లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేసు వర్కర్, పారా లీగల్ పర్సనల్, సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టుల ఖాళీలకు జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేస్తూ, తిరిగి ఆ పోస్టులలో అర్హులగు అభ్యర్థినుల కోసం మళ్లీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. నోటిఫికేషన్, వయసు, విద్యార్హత తదితర పూర్తి వివరాలకు జిల్లా వెబ్‌సైట్ https://nandyal.ap.gov.inను పరిశీలించగలరని వెల్లడించారు.

పాణ్యంలో టిడిపి జెండా ఎగరాలి : గౌరు చరిత

ప్రజాశక్తి - పాణ్యం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు పాణ్యం నియోజక వర్గంలో టిడిపి జెండా ఎగురవేయాలని నియోజకవర్గ ఇంచార్జి గౌరు చరిత అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ జగన్‌ను ఓడించడానికి, అలాగే 40 ఏళ్ల రాజకీయ జీవితమని చెప్పుకునే కాటసానిని కూడా జనం ఓడించడానికి సిద్ధంగా వున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేత గౌరు వెంకటరెడ్డి, మండల నాయకులు జయ రామి రెడ్డి, కౌలురు భాస్కర్ రెడ్డి, మల్లు గోవింద రెడ్డి,ల ాయర్ బాబు, రమణ మూర్తి, రంగ రమేష్, ఇప్ప సుధాకర్, దుబాయ్ శీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరు చరిత

ముగిసిన బ్రహ్మోత్సవాలు

5వ పేజీ తరువాయి.. నిర్వహించారు. వేద పండితులు రవిశంకర్ అవధాని, శాంతారామ్ భట్, నాగేశ్వర శర్మ, ఉప ప్రధాన అర్చకులు జనార్ధన శర్మ, రాఘవేంద్ర శర్మల సారథ్యంలో వసంతోత్సవ వేడుకల సంబరం అంబరాన్నంటింది. కలశ జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు సమర్పణ చేశారు. అనంతరం రుద్రగుండంలో వసంతం చల్లుకున్నారు. తర్వాత కోనేటిలోని పంచలింగ మండపంలో త్రిశూల చండీశ్వర స్వామివార్లకు విశేషా చూర్ణాలు, గంధం, క్షీర, జలాభిషేకాలు చేశారు. ఈ క్రమంలోనే మహా పూర్ణాహుతి, దీక్ష హెూమం, రుద్ర హెూమం, ప్రాతర్ అగ్నికార్యం, నందితీర్థంలో మహాస్నపన, అవబృదోత్సవం, ధ్వజ అవరోహణం, కలశ ఉద్వాసన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, సుధా కుమారి, నంద్యాల దాత లక్క బోయిన ప్రసాద్‌లు పాల్గొన్నారు.



మహానంది క్షేత్రంలో...

యాగంటిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు - భక్తిశ్రద్ధలతో శివదీక్ష విరమణ

బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ధ్వజ ఆరోహణతో ముగిశాయి. శివదీక్ష విరమణ కార్యక్రమం వైభవంగా జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, శివమాల ధరించిన భక్తులు ఇరుమడి ధరించి పాతపాడు నుండి నడుచుకుంటూ దేవస్థానానికి చేరుకుని దీక్ష విరమించారు. కార్యక్రమంలో కాటసాని ఉమా మహేశ్వరమ్మ, వారి తనయుడు కాటసాని శివ నరసింహరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ దోనపాటి యాగంటిరెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి, ఉమా మహేశ్వర నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి మల్కిరెడ్డి దస్తగిరి రెడ్డిలు పాల్గొన్నారు.



కాలినడకన యాగంటికి వెళ్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, శివ భక్తులు



భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపిపి, చైర్మన్

ఆలయ అభివృద్ధికి కృషి

- ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి- బేతంచెర్ల

మండలంలోని బుగ్గానిపల్లి గ్రామంలో వెలసిన పురాతన బ్రహ్మసహిత నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం ఆలయ ధర్మకర్తలు చిన్ని శేషుని ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని దేవాలయాలను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి త్వరలో నాగలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి రూ. 40 లక్షలు మంజూరు చేశారన్నారు. అనంతరం రజకులకు 5 లక్షల రూపాయలతో దోబీ ఘాటును ప్రారంభించడానికి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగ వెంకటేశ్వర్లు, కొమ్ము మధు, వైస్ ఎంపీపీ రంగస్వామి, నారాయణ, వెంకట్ రాముడు, కృష్ణుడు, గోరుమానుకొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, గూని నాగరాజు, సచివాలయ కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లెలో ఈనెల 14న జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైసిపి నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 14న రూ. 22 కోట్లతో నూతనంగా నిర్మించిన బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాల భవనాలను సిఎం ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగిస్తారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అధికారిక హెూదాలో మొదటిసారి బనగానపల్లె పట్టణానికి విచ్చేయుచున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని వైసిపి నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, అధికారులు, వాలంటరీలను కోరారు. కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు షేక్ బాబులాల్, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, బనగానపల్లె మండలం కన్వీనర్ సన్నల జనార్దన్ రెడ్డి, పట్టణ బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నూతన కార్యాలయం ప్రారంభం

- కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం : కోట్ల

ప్రజాశక్తి - ప్యాపిలి : ప్యాపిలి పట్టణంలో టీడీపీ నూతన కార్యాలయంను డోన్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా బస్టాండ్‌కు వరకు వెళ్లారు. బస్టాండ్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ మంత్రిని ఉద్దేశిస్తూ రాష్ట్రానికి మూడు రాజధానులు మాటో ఏమో గాని మంత్రికి మూడు పేర్లు ఉన్నాయన్నారు. రాష్ట్రానికి అప్పుల మంత్రి, డోన్‌కు రేకుల మంత్రి, పిట్ట కథల మంత్రి అని, ఇక మంత్రి కథ అయిపోయిందన్నారు. మూడు నాలుగు రోజులే ఉండేదని, పోలీసులకు చెప్తున్నా వచ్చేది టిడిపి ప్రభుత్వం కాబట్టి తమ పార్టీ కార్యకర్తలను అనవసరంగా భయభ్రాంతులకు గురి చేయవద్దన్నారు. అనంతరం హెచ్‌ఆర్‌పల్లి గ్రామస్తులు నాగేశ్వరరావు యాదవ్, గుడిపాడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కంబగిరి స్వామి, అశోక్, రామచంద్రుడు, రాజు, మహేష్, రఘురాం, నాగరాజు, శ్రీనివాసులు, లక్ష్మం స్వామి తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, రామసుబ్బయ్య, రామ్మోహన్ యాదవ్, కాజా పీర్, కిట్టు, వెంకటరమణ ఆచారి, తొప్పల వెంకటేష్, అలెబాద్ పరమేష్, చల్లా వీర, వెంకటేష్, రమేష్, కొంగన పల్లె మధు, ప్రిన్సిపల్ మధు, అనుదీపు, అక్బర్, పుల్లారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నూతన కార్యాలయంను ప్రారంభిస్తున్న కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబటి గురివి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి కీలకమన్నారు. అనంతరం పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు.



ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న అంబటి గురివిరెడ్డి

మంత్రి బుగ్గన నోరు అదుపులో పెట్టుకోవాలి

- కోట్ల కుటుంబానికి ప్రజలే బలం

- డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి - డోన్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, డబ్బు అహంకారంతో మాట్లాడితే ఖబర్దార్ అని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి ల ఆధ్వర్యంలో ఎర్రగుంట్లపల్లి, కలచట్ల, డోన్ మండలంలోని బి రామదుర్గం గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. వైసిపి నాయకులు రామేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వందమంది, బి.రామదుర్గం సాంబశివుడు, రామలింగడు, లక్ష్మన్నలతో పాటు మరో 50 మంది టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బుగ్గన ఐదేళ్ల కాలంలో మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు. బుగ్గన అవినీతి చిట్టాను త్వరలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. కోట్ల కుటుంబాన్ని డబ్బు లేదని బుగ్గన అంటున్నాడని, ప్రజలే తమ బలమన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఏర్పాటుతో రాష్ట్రంలో వైసీపీకి ఓటమి ఖాయం అయిందన్నారు. కార్యక్రమంలో లక్కసాగరం లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టియి.కేశన్నగౌడ్, ఓబులాపురం శేషిరెడ్డి,మద్రి రమణ, ఓంప్రకాష్, జనసేన నాయకులు పరదేశి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలోకి ఆహ్వానిస్తున్న కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలి : కోట్ల నివేదిత రెడ్డి

వచ్చే ఎన్నికలలో టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలని డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత రెడ్డి కోరారు. సోమవారం డోన్ పట్టణంలోని మాకం వీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ టిడిపి ప్రభుత్వంలోనే ఉంటుందన్నారు.

హుండీ కానుకలు లెక్కింపు

ప్రజాశక్తి - గడివేముల : మండలంలోని గడిరేవుల గ్రామ సమీపంలో ఉన్న శ్రీ దుర్గా భోగేశ్వరాలయం హుండీ కానుకలను సోమవారం ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ గత సంవత్సరం 2 లక్షల 98 వేల 362 రూపాయలు రాగా ఈ సంవత్సరం 3 లక్షల 64 వేల 731 రూపాయలు వచ్చిందన్నారు. సిఏఓ పిసి సంపత్ కుమార్, పర్యవేక్షణ అధికారి గోపి, ధర్మకర్తలు శివుడు, పరమేశ్వర్ రెడ్డి, కుమార్, శ్రీనివాసులు, సురేంద్రనాథ్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కేంద్ర కాటన్ బోర్డు మాజీ సభ్యులు వాసు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : కేంద్ర కాటన్ బోర్డ్ మాజీ డైరెక్టర్, టిడిపి తాలూకా నాయకులు చింతకుంట శ్రీనివాస్ రెడ్డి అలియాస్ వాసు సోమవారం తన పుట్టినరోజు వేడుకలను అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు వాసు చేత కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు వాసుకు వారు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అభిమానులు ఆయనతో సెల్ఫీలు దిగారు. తదనంతరం వాసు జన్మదినమును పురస్కరించుకొని 25 మంది అభిమానులు రక్తదానం చేశారు.



శ్రీనివాస రెడ్డికి కేక్ తినిపిస్తున్న డాక్టర్ రామ్ గోపాల్

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి : దార సుధీర్

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రజాసేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలు ఆశీర్వదించి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని నందికొట్కూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ తెలిపారు. సోమవారం కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న నాకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర శాప్ చైర్మన్ రెడ్డి సిద్ధార్థ రెడ్డి తనపై నమ్మకం ఉంచి నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాసేవ తోపాటు అభివృద్ధి చేస్తానన్నారు. నందికొట్కూరు నియోజకవర్గాన్ని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో నడుపుతామని తెలిపారు. కొత్తపల్లి మండల అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమలత, జెడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, మండల వైసీపీ నాయకులు లోకేశ్వర్ రెడ్డి, నంద్యాల ఉస్మాన్, నారాయణరెడ్డి, నాగ ఎల్లయ్య, చింతమాను శ్రీనివాసులు యాదవ్, అచ్చిరెడ్డి, కృష్ణుడు రమేష్, ముని వెంకటరెడ్డి, బాబు రెడ్డి, పాండు, రాజేష్, మల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడప గడప ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్

టిడిపి విజయానికి కృషి చేయాలి : ఎంఎస్ అన్సర్ బాషా

ప్రజాశక్తి - చాగలమర్రి

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ బాషా కోరారు. సోమవారం స్థానిక రిక్వెస్ట్ స్టేజి వద్ద యూనిట్, నాలుగవ ఎంపిటిసి ఇన్చార్జ్ జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో ఎంఎస్ అన్సర్ భాష సూపర్-6 ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాగలమర్రిలోని పలు కాలనీలలో టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తూ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ టిడిపి అభ్యర్థి భూమా అఖిల ప్రియను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి మాబు షరీఫ్, ఆలంశ గారి మౌలాలి, ముల్లా గఫార్, నూర్ భాషా, ఖలీల్ ,హనీఫ్, మద్దూరు మాబులాల్, నాగూర్, జహీర్, జెట్టి బాలుడు, ముల్లా అజీమ్, కరిముల్లా, బారిక్ చామల్ మాభాష, రియాజ్, వెంకటయ్య, రఫీ, ముల్లా రఫీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సూపర్-6 ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎలక్ట్రోల్ బాండ్స్ బయట పెట్టాలి

5వ పేజీ తరువాయి.. పాల్పడుతున్న బిజెపిని, వత్తాసు పలుకుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారిని వెంటనే కోర్టు ధిక్కరణ కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, జిల్లా నాయకులు రాజశేఖర్, నాయకులు గోపాల్, వెంకట లింగం, గౌస్, రామరాజు, సాయి, బెన్ని, కరుణాకర్, ప్రసాద్, సురేష్, రమణ, వెంకటేశ్వర్లు, నాగన్న, రవి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్లలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలని, ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గత పరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్‌కు అర్జి అందజేశారు. నాయకులు మాభాష, ఎన్. స్వాములు, రామ్ నాయక్, షైక్ ఇస్మాయిల్, వీరన్న, కిరణ్, సత్య నారాయణ, నబి, నూర్, రవి, హుస్సేన్, గణపతి, స్వామన్న తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** ఎన్నికల బాండ్లు వివరాలను ప్రకటించడంలో ఎస్‌బిఐ వైఖరి నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు మెయిన్ బ్రాంచి ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరావు మాట్లాడారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పకీర్ సాహెబ్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, రూరల్ కార్యదర్శి నాగన్న, వ్యకాస జిల్లా నాయకులు కర్ణ, శ్రీనివాసులు, ఓబులేసు, వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ నాయకురాలు జయ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్ పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** మండలంలోని ఏ.కోడూరులో ఉన్న ఎస్‌బిఐ బ్యాంక్ ముందు సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, సీనియర్ నాయకులు రామచంద్రుడు డేవిడ్, రాజులు ధర్నా చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ధర్నా చేస్తున్న నాయకులు



నందికొట్కూరులో ధర్నా చేస్తున్న నాయకులు



బండి ఆత్మకూరు : ధర్నా చేస్తున్న నాయకులు